# అనేకత్వములోని ఏకత్వమును గుర్తించడానికి కృషి చేయండి!

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యంబునందణగె సర్వసృష్టి
సత్యమహిమ లేని స్థలమేదికనుగొన్న
శుద్ధ సత్త్వమిదియె చూడరయ్య

సారము లేనియట్టి భవసాగరమందున మున్గి తేలుచున్
దారియు తెన్నునున్ గానక తత్తరమందెడి మానవుండ! నీ
యోరిమి నించుకంత మదినూనుచు భక్తిని కల్గిచూడు శ్రీ
కారుడు సత్యసాయి నిను కావగ వచ్చిన నావ గాంచవే!

**విద్యార్థులారా!**

మానవ జీవితములో సాధించవలసిన ప్రధాన కార్యములలో అతిముఖ్యమైనది భగవత్ ప్రేమ. జగత్తునందుగల సకల సంపత్తులలో ప్రధానమైనది భగవత్ ప్రేమ. సమస్త సంపత్తులు యీ ప్రేమనుండియే ఆవిర్భవించిన బిందువులు. భగవంతుడు అనే శబ్దమునకు అర్థము గుర్తించినప్పుడే యీ భగవత్ ప్రేమయొక్క విలువను మనము అర్థము చేసుకోగలుగుతాము. భగవంతుడు, బ్రహ్మ, పరబ్రహ్మ యిత్యాది పదములందు అతిసారవంతమైనది 'భగవాన్' అనే పదము, పాలలో చివరి పదార్థము నేయి అయినట్లుగా! పాలను పెరుగుగా మార్చవచ్చు, పెరుగును చిలికి వెన్న తీయవచ్చు. వెన్నను కరగించి నెయ్యి చేయవచ్చు. కాని ఆ నెయ్యి వేరే ఏ పదార్థముగా మార్చుటానికి వీలుకాదు. దానిని ఆ రూపములో భుజించవలసినదే! అదేవిధముగా బ్రహ్మ అని, పరబ్రహ్మ అని, పరమాత్మ అని, ఆత్మ అని అనేక విధములుగా పదములను ఉపయోగ పెట్టుకోవటానికి అవకాశముంది. కాని యీ



sri sathyasai vachanamrutam

చివరి పదము అయిన 'భగవాన్' అనే దానిని వేరుగా మార్చటానికి వీలు లేదు. ఈ ఆత్మ అనే పదములో దేహాత్మ, జీవాత్మ, పరమాత్మ, ప్రత్యగాత్మ అని అనేక ఆత్మలుగా మనము వ్యవహరించటానికి వీలుంది. కాని, 'భగవాన్' అనే పదమును 'భగవాన్' గానే వ్యవహరించాలిగాని మార్చటానికి వీలు కాదు. భగవాన్ ఒక్కడే. అదే అంత్యమైన శబ్దము.

**భగవత్ప్రేమను పొందుటకై తగిన సాధనను సల్పటమే మానవత్వములోని అంతరార్థము**

'భ' అనే శబ్దమునకు సకలైశ్వర్యసంపన్నుడు, సకలసిద్ధి సంపన్నుడు, సృష్టి, స్థితి, లయ కారకుడు అని అర్థము. ఒకే అక్షరమైన 'భ' అనే అక్షరమునకు సంభర్త, భర్త అనే రెండు అర్థములున్నాయి. 'సంభర్త' అనగా ప్రకృతిని సాధనముగా తీసుకుని సృష్టి చేయగల శక్తి గలవాడు. సృష్టించిన ఈ జగత్తును పాలించే అధికారము కలిగినవాడు కనుక, అతనికి 'భర్త' అని రెండవ అర్థము. మరొక విధముగా 'భ' అనగా కాంతి, ప్రకాశము, దీపము, తేజస్సు, జ్యోతి యిత్యాది అర్థములతో కూడినది. 'గ' అనగా వ్యాప్తి. 'వంతుడు' అనగా సమర్థుడు అని. 'భగవంతుడు' అనగా దివ్యమైన జ్యోతిని, ప్రజ్ఞాన జ్యోతిని, అద్వైత జ్యోతిని, అఖండ జ్యోతిని, ఆత్మ జ్యోతిని వెలిగించే అధికారము కలవాడు అని. ఇట్టి సర్వసమర్థుడైన భగవంతునియొక్క తత్త్వాన్ని, ప్రేమను మనము పొందినప్పుడు దానికంటె మించి మనము పొందగలిగేది యీ జగత్తులో లేదు. ఇహమునందుగాని, పరమునందుగాని దీనికి మించిన మహత్తరమైన శక్తి మరొకటి లేదు. కనుకనే, భగవత్ ప్రేమను పొందుటకై తగిన సాధనను సల్పటమే మానవత్వమునకు సరైన అంతరార్థము.

**మానవుడు ఆనందమయమైన జీవితమును గడపాలంటే మానసిక విశ్రాంతి అవసరము**

దీనిని ఆధారముగా తీసుకుని 'జంతూనాం నరజన్మ దుర్లభమ్' అన్నారు. జీవరాసులలో ఈ మానవత్వము ఉత్కృష్టమైనది, సౌజన్యమైనది, సౌశీల్యమైనది. అట్లు జన్మించిన మానవుడు ఆనంద జీవితమును గడపవలెనన్న మానసిక విశ్రాంతి అత్యవసరము. మనస్సు మహావేగము కలిగినది. వేగముతో పరుగెత్తే రథములను ఆపేందుకు కొన్ని బ్రేక్స్ అనే వాటిని వినియోగిస్తున్నారు. ఈ వాహనములకు వేగమును అరికట్టే నిమిత్తము ఏ విధముగా బ్రేక్స్ పెట్టారో, ఈ మనస్సు అనేది వేగంగా పరుగెత్తుతుంది కనుక దీనికి కూడా ధ్యానము అనే ఒక

srisathyasaivachanamrutam

బ్రేక్ పెట్టారు. ఈ ఏకాగ్రతకు మానసిక విశ్రాంతి అత్యవసరం. ఈనాడు లోకములో మితిమీరిన రోగములు అధికము కావటానికి మూలకారణము, మనస్సుకు విశ్రాంతి లేకపోవటమే! రోగములనుండి మనం దూరము కావలెనన్న, ప్రశాంతమైన జీవితమును గడపవలెనన్న, ఆరోగ్యాన్ని అందుకోవలెనన్న మానసిక విశ్రాంతి అత్యవసరము. ఈనాటి విద్యార్థులకు మానసిక విశ్రాంతి అంటే ఏమిటో తెలీదు. నిద్రించేంతవరకు మనస్సులో అనేక విధములైన తలంపులతో వారు మునిగి వుంటారు. ఇంక లేచినది మొదలు ఈ తలంపులు ప్రారంభమవుతాయి. లేచినదిమొదలు నిద్రించేంతవరకుకూడను ఈ తలంపులతోనే తను జీవితాన్ని అనేక విధములుగా హింసలకు గురి చేస్తున్నారు. కనుక, విద్యార్థులయొక్క ఆరోగ్యము మనము అనుకున్నరీతిలో అనుభవించటానికి వీలులేకుండా వుంది. మానసిక రోగం తప్పితే శారీరక రోగం, శారీరక రోగం తప్పితే మానసిక రోగం, ఈ విధముగా ఒకదాని తరువాత మరొకటి నిత్యమూ అనుభవిస్తూ వున్నారు ఈనాటి విద్యార్థులు. కలకత్తా యూనివర్సిటీలో పోయిన మూడు సంవత్సరములలో విద్యార్థులయొక్క ఆరోగ్యమునుగురించి పరిశోధన సలిపినప్పుడు 85 శాతం విద్యార్థులు ఏదో ఒక విధమైన అనారోగ్యంతో ఉన్నారని తెలిసింది. అదే మద్రాసు యూనివర్సిటీలో చూసినప్పుడు 90 శాతం రోగులుగా వుంటున్నారు, విద్యార్థులు. బొంబాయిలో చూస్తే వారు 82 శాతం వ్యాధిగ్రస్తులుగా వున్నారు. ఈ విధముగా చూస్తూవుంటే ప్రతి యూనివర్సిటీలోపల యువకులైనవారు, మంచి బలవంతులు శూరులు, వీరులు, గంభీరులైన ఈ విద్యార్థులందరూ ఈ విధమైన రోగములతో కుళ్లిపోతున్నారు, కృంగిపోతున్నారంటే నిజముగా వీరి భవిష్యత్తు ఎంతవరకు!

**ఈనాడు అనేకాగ్రత, శూన్యత్వము, ఈ రెండూ మానవుని అధోగతి పాలుచేస్తున్నాయి**

ఈ అనారోగ్యమునకు మూలకారణము ఆహారవిహారములే! ఆ ఆహారమనేది ఏది తినవలసింది, ఏది తగనిది అనే విచారణా శక్తి వీరిలో శూన్యమైంది. ఆకలిని తీర్చుకునే సమయములో ఏది చిక్కినా దానిని భుజిస్తున్నారు, ఈ విద్యార్థులు. ఆకలినైనా మనము అరికట్టటానికి ప్రయత్నించవచ్చుగానీ అనారోగ్యమునకు గురిచేసే ఆహారమును ముట్టరాదు. ఇక, వారి విహారములు చూస్తామా అంటే చెప్పతరము కాదు. దీనివలన మానసికముగా

sri sathyasai vahamrutam

శారీరకముగా అనారోగ్యము అనుభవిస్తూ ఏకాగ్రత, జ్ఞాపకశక్తి నశించి, నరముల బలహీనతకు వారు గురవుతున్నారు. కనుక, విద్యార్థులీనాడు పుష్టిగా, సంతుష్టిగా జీవించవలెనన్న వ్యాయామము అత్యవసరము.

మానవుని మనస్సును రెండు విధములైన దౌర్బల్యములు ఆవరించియుంటాయి. ఒకటి అనేకాగ్రత, రెండవది శూన్యత్వము. ఫలితంగా ఏకాగ్రత నశిస్తుంది. ఇక్కడ శూన్యత్వము అంటే యేమిటి? ఏదైనా మంచి విషయములు, మంచి కథలు, మంచి ఉపన్యాసములు వినవలెనన్న అక్కడికి పోయేటప్పటికి నిద్రాదేవి ఆవరిస్తుంది వారిని. ఆవలింతలతో ప్రారంభమై కుంభకర్ణుని నిద్రవరకు ప్రయాణం చేస్తుంది. వినాలనే శ్రద్ధ వారికి శూన్యమైపోతుంది. ఏమైనా మంచి కార్యక్రమములలో ప్రవేశించినప్పుడే యిలాంటి భావములంతా వారిలో ప్రవేశిస్తూంటాయి. పోనీ పడుకుందామని రూములోకి వెళ్ళి బెడ్ వేసుకుని పడుకుంటే ఆలోచనలన్నీ చుట్టుముట్టుతాయి. పడుకుంటే నిద్రరాదు. వినాలని పోతే తూగువస్తుంది. ఇలా రెండు విధములా భ్రష్టుడై పోతున్నాడు. తమో గుణము, అదే అంధత్వము అదే శూన్యత్వము. ఈ అనేకాగ్రత, శూన్యత్వము మానవుని అధోగతి పాలుచేస్తున్నాయి. అందువలన యీనాడు ఏకాగ్రత మానవునికి అత్యవసరము. ఈ ఏకాగ్రత మనము సాధించవలెనన్న ఆటపాటలు అత్యవసరము. ఆటలవలన మనకు ఆరోగ్యము అభివృద్ధి అవుతుంది. దేహము మంచి పుష్టిగా వుంటుంది. దేహము ఆరోగ్యముగా వున్నప్పుడు మనస్సు కూడా ఆరోగ్యముగా వుంటుంది.

**ఆటపాటలు ఆరోగ్య, ఆనందముల నిమిత్తమే!**

అయితే ఈ ఆటలు, పాటలు ఏ లక్ష్యముతో సాధించాలి? కేవలము ఆరోగ్య ఆనందముల నిమిత్తము, ఆట పాటలు. దురదృష్టవశాత్తు, ఈనాడు ఆటలు పాటలుకూడా వ్యాపారంగా తయారయ్యాయి. ఈ ఆటలు ఆడటానికి ఒక్కొక్కదానికి యింతని రేటు నిర్ణయం అయిపోయింది. ఒక వెల నిర్ణయించారు. ఇక పాటలు అభివృద్ధి గావించటం కచ్చేరీలు చేయటానికే! కచేరికి యింతని అక్కడకూడా వ్యాపారంగానే వుంటుంది. ఎప్పుడు ఆటపాటలు ఆనందం, ఆరోగ్యంకొరకు కాక ధన నిమిత్తమై ప్రాకులాడటానికి ప్రయత్నిస్తారో అప్పుడే వీరి ఆరోగ్యముకూడా క్షీణించిపోతుంది. యీనాటి ఆటపాటలు కళలుక్రింద మారిపోయినాయి.

sri sathyasai vachanamrutam

Art is out side. Heart is inside. ఆరోగ్యము, ఆనందము నిమిత్తమై ఆటలు ఆడినప్పుడు పాటలు పాడినప్పుడు అది Heartకు చేరుతుంది. ఈ Art అంతా వచ్చింది Heart నుండి అనే సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నారు. అందువల్లే మానసిక బలహీనతలకు దురవస్థలకు గురి అవుతున్నారు. ఆత్మబలమును, మనోబలమును సంపాయించితివా, సర్వబలములను నీవు సాధించినవాడవవుతావు. అయితే ఈ విద్యలన్నీ, ఈ కళలన్నీ ఏ లక్ష్యం కోసం? మనము ఏ దేశములో పుట్టినామో, ఏ మాతృగర్భంలో మనం జన్మించామో, ఆ మాతృదేశమునకు, ఆ మాతృమూర్తికి తగిన కీర్తిని సాధించాలి అనేదే మన లక్ష్యము. దురదృష్టవశాత్తూ ఈనాడు ఆర్థిక సంపత్తులపైననే మన లక్ష్యము వుంచుకోటంచేత మనము అధోగతి పాలైపోతున్నాము. మీకు తెలుసు Money comes and goes. ఈ ధనము నిమిత్తమై పోతే గుణాన్ని మనం కోల్పోతాము.

యువకులైన విద్యార్థులకు కావలసినది త్యాగము, దేశభక్తి, దైవభక్తి. ఈ మూడే అత్యవసరమైనవి. ఈనాడు స్వార్థము, స్వప్రయోజనము, అహంకారములతో నిండిపోవటంచేతనే మానవత్వము మనకు చాలా దూరంగా వుంది. ఈనాడు దేశమునందు దైవభక్తి, దేశభక్తి, త్యాగము ఈ మూడింటిని వికసింపజేయాలి, ప్రకటింపజేయాలి. వీటిని సాధించే నిమిత్తమై నాది నాది అనుకున్న తమ దేహమును, తమ భావమును, తమ సుఖమును త్యాగము చేయాలి. అట్టి త్యాగభావము కలిగిన యువకులు, వజ్ర సంకల్పము కలిగిన యువకులు విరివిగా అభివృద్ధి కావాలి. అప్పుడే దేశమును ఆవరించిన ఈ అశాంతిని దూరము గావించుకోవటానికి మనకు అవకాశము ఏర్పడుతుంది. డబ్బులు తీసుకొని బజారులలో కూసే వాలంటీర్లుగా మనం తయారు కాకూడదు. స్వార్థపరులైన అహంకారులుగా మనము తయారు కాకూడదు.

**జీవితమును అర్పితము చేయవలసినది దేశమునకు, దైవమునకు మాత్రమే!**

ఈనాడు ఆత్మను అమ్ముకొని, అపమార్గంలో ప్రయాణం చేస్తున్నాడు, మానవుడు. అన్యాయ, అక్రమ, అనాచార, అసత్యాదుల నెదుర్కొనే పౌరుషమును పెంపొందింజేసేదే మన భారతీయ సంస్కృతి అని గుర్తించాలి. క్షమ అనే యజ్ఞమునుండి వుద్భవించిన శక్తియే భారతీయుల భక్తి

sri sathyasaivachanamrutam

అని విశ్వసించాలి. ఇంటింటా ఒక దీపము పెడితే బజారంతా లైట్లు వున్నట్లుగా, ప్రతి యింటిలోను ఈ విధమైన పవిత్ర భావములతో నిండిన ఒక యువకుడు జన్మించాలి. మన చదువంతాకూడను ఉద్యోగముల నిమిత్తము కాదు. ఈనాడు అధికార దాసత్వము మరియు మానసిక దాసత్వమునకు లొంగిపోతున్నారు. ఈ దాస్యమును దూరము గావించుకోవాలి. ధైర్యసాహసములను పెంచుకోవాలి. ఒక్క దైవత్వానికి తప్ప అన్యమునకు తలవంచే మార్గమును అవలంబించరాదు. అందరినీ గౌరవించవలసినదే! అందరినీ ప్రేమించవలసినదే! పెద్దలకు తగిన కృతజ్ఞతను అందించాలి. కానీ, జీవితమును అర్పితము చేయవలసినది దేశమునకు, దైవమునకు మాత్రమే! కర్మబలము, దైవబలము ఈనాడు క్షీణించిపోవటంచేతనే దానవ బలము అభివృద్ధి అయిపోయి తాండవమాడుతున్నది. తన స్వశక్తిపైన తాను నిలవాలి. తన కాళ్లపై తాను నిల్చుకోవాలి. తన మనస్తత్వమును భగవత్ తత్త్వంగా మార్చుకోవాలి. ఏకత్వము నుండి సమిష్టితత్త్వములోనికి మనం ప్రవేశించాలి. అంతేకాని, ఏకత్వమునుండి అనేకత్వమునకు పోవటానికి ఏమాత్రం ముందంజ వేయరాదు. బాహ్యంగా గోచరించే అనేకత్వంలో ఏకత్వమును దర్శించటానికి పూనుకోవాలి. అదే Unity in Diversity. వీటి కన్నిటికి ఒక ఆధారము వున్నది. ఈ జగత్తులో నివసించే సమస్త ప్రాణులకు ఒక ఆధారము వుంది. విషయములు వేరు కావచ్చు, సిద్ధాంతములు వేరు కావచ్చు, వ్యక్తులు వేరుకావచ్చు, క్రియలు వేరుకావచ్చు. కాని అన్నింటికి ఆధారమైన ఆత్మ తత్త్వము ఒక్కటే. దీనినే అనేక పర్యాయములు చెప్పాను.

Stars are many but sky is one
Jewels are many but gold is one
Nations are many but earth is one
Beings are many but breath is one

ఈ విధముగా అనేకత్వములో వుండిన ఏకత్వమును చూచేందుకు ప్రయత్నించాలి. అదే ఈనాడు యువకులు చేయవలసిన ప్రధానమైన కృషి.

**కుల, మత భేదములకు ఏమాత్రము అవకాశమివ్వరాదు**

మతముగాని కులముగాని యింకేవిధమైన భేదములకుగాని మనము ఏమాత్రం అవకాశము యివ్వరాదు. ఏ మతంవారుగాని, ప్రచారకులుగాని, ఏ ప్రవక్తలుగాని, ఏ మతకర్తగాని



sri sathyasai vahini.com

సత్య, ధర్మ, త్యాగములు మరియు సహనసౌశీల్యములను కాదని చెప్పే మూర్ఖులు వుండరు. కనుకనే ఈనాడు సహన సానుభూతులచేత త్యాగము, ఔదార్యములతో మనము ప్రేమతత్త్వమును పెంపొందించుకోవాలి. వీటిని మనము సాధించవలెనన్న భగవత్ ప్రేమ అత్యవసరం. దీనినే పోయిన జన్మదినోత్సవములో చెప్పాను. Love of God, Fear of Sin and Morality in Society అని. అనగా దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి. ఈ మూడింటితోనే మన జీవితము ముడిపడి వుండాలి. దీనిని పురస్కరించుకొనియే భారతీయ సంస్కృతియందు ముక్కోటి దేవతలను ముమ్మూర్తులుగా భావించి దేశవ్యాప్తి గావించారు. ఇంతమంది దేవతలంటే ప్రత్యేకంగా దేవతలని కాదు. ఒక్కొక్క వ్యక్తి కూడను ఒక్కొక్క దేవతా స్వరూపమే! ఆనాటి ఉపనిషత్ కాలములో 3 కోట్లు మాత్రమే వుండేవారు దేవతలు అన్నారు. కానీ, ఈనాడు 80 కోట్ల దేవతలున్నారు, భారతదేశములో. ఒక్కొక్క జీవికూడను దేవుడనే రీతిగా భావిస్తూ వచ్చారు. ప్రతి ఒక్క విషయమునందును విశాలత్వమును మనము పెంచుకోవాలి. ఇదే ఈనాడు మనము సాధించవలసినది. ఇట్టి పవిత్రమైన దివ్యత్వమును సాధించటానికి కొంత శారీరక దృఢత్వంకూడను అత్యవసరం. దానికి తగినట్లుగా మనోశక్తికూడా అవసరము. ఈ రెండింటి ద్వారా సాధించలేని కార్యము జగత్తులో ఒక్కటికూడ వుండదు. బ్రహ్మతత్త్వము ఏదో ఒక ప్రత్యేకమైన స్వరూపం కాదు. ఈ కన్పించే దృశ్యకల్పితమైన జగత్తంతయుకూడను ఒకే ఏకాత్మపైన ఆధారపడి వున్నది. అదే నిజమైన బ్రహ్మతత్త్వము. అదే అద్వైత సిద్ధాంతము. రూపనామములు వేరుగా వుండవచ్చును కాని, పదార్థము ఒక్కటే! పరార్థము ఒక్కటే! ఇలాంటి సత్యాన్ని మనము ఉపనిషత్ మార్గములో అందుకొనుటకు ప్రయత్నించాలి. ఉపనిషత్ అనగా ఏమిటి? 'ఉప' అనగా సమీపము 'షత్' కూర్చో. దైవానికి దగ్గరగా నీవు కూర్చో. దైవత్వమునకు దగ్గరగా నీవు నివసించు. దైవత్వమునకు దూరంగా వుండటంవల్లే దయ్యములదగ్గరికి పోతున్నారు మానవులు. కనుకనే మనము దైవత్వమునకు సమీపముగా వుండాలి. ఆ దివ్యత్వమును ప్రత్యేకముగా మరొక దేశంలో వెతకనక్కరలేదు. దివ్యత్వము తనయందే వుంటుంది.

**కోరికలు వుండినంతవరకు శాంతి లభ్యముకాదు**



sri sathyasai vahanamrutam

ఇలాంటి పవిత్రమైన మానసిక శాంతి మనకు లభించాలంటే క్రమక్రమేణా మన వాంఛలను అదుపులో పెట్టుకుంటూ రావాలి. కోరికలు వుండినంతవరకు శాంతి మనకు లభ్యము కాదు. మనకు భగవంతుడెంత దూరంలో వుంటున్నాడంటే నీకు నీవు ఎంత దూరమో భగవంతుడు అంతే దూరంలో వుంటున్నాడు. దూరమనుకుంటే దూరముగా వున్నాడు. సమీపమనుకుంటే తనలోనే వున్నాడు. ఈ రెండింటికి మనోభావమే నీకు మూలకారణం కానీ దైవత్వము కాదు. కనుక, ఈ మానసిక భావానికి తగిన శక్తి, సామర్థ్యాలను మనము అందించాలి. ఆ శక్తియే ప్రేమశక్తి. ఆ శక్తియే దివ్యశక్తి. అది రసస్వరూపమై మానవునిలో సర్వత్ర వ్యాపించి వుంటుంది. అందువలననే ఉపనిషత్తులు 'రసోవైసః' అని వర్ణించాయి. ఆ రసస్వరూపమునుంచి రసమే వస్తుంది. నీరసం ఏమాత్రము లభించుటకు వీలులేదు. మన దేహములో వున్న సమస్తముకూడను రసస్వరూపమే! మన దేహమంతా కూడను blood cells... మనం తరుచు 'శాంతి, శాంతి' అంటుంటాము. అది భగవంతునియొక్క సృష్టి కాదు. అది ఎక్కడ నుండి వస్తుంది! నీవు చేసే పనులనుండి, నీ తలంపులనుండి శాంతి నీకు లభిస్తుంది. మన తలంపులు మంచివైతే మనకు శాంతి సులభముగా లభిస్తుంది. మన నడతలు మంచివైతే మనకు శాంతి సులభముగా లభిస్తుంది. మన నడతలు, మన తలంపులు విరుద్ధముగా వున్నప్పుడు శాంతికి విరుద్ధమైన అశాంతినే మనము అనుభవిస్తాము. మన శాంతికి, అశాంతికి కారణమేమిటి? మన తలంపులు, మనయొక్క పనులు. చేసేది చెడ్డ, కోరేది మంచి. ఇది ఏ రీతిగా వస్తుంది?.

**నిమ్మమును నాట చూతఫలంబు కల్గునా?**
**చూతమును నాట నిమ్మఫలంబు కల్గునా?**

ఒక నిమ్మ విత్తనము నాటి, మంచి మామిడిపండు కావాలంటే లభిస్తుందా? మామిడి విత్తనం నాటి మంచి నిమ్మపండు కావాలి, చిత్రాన్నము చేసుకోవాలంటే వస్తుందా? ఇది సరైనది కాదు. మనము ఏ విత్తనము నాటుదుమో అదే ఫలితము మనకు లభిస్తుంది.

**ఇది చేతు నది చేతు నింకెన్నియో చేతు**
**నను చు నూహలు అల్లి అలసిపోకు**
**ఏ విత్తులను నాటి యిచ్చోట నుంటిరో**

sri sathyasai vachanamrutam

ఆ ఫలములె మీకు అందుచుండు
విత్తనంబొకటైన వేరైన ఫలములు
సమకూరుటది యెట్లు సాధ్యమగును?
జనని గర్భమునుండి జన్మించినప్పుడు
కంఠమాల లనేని కానరావు
మంచి ముత్యపుసరుల్ మచ్చునకును లేవు
మేల్మిబంగరుదండ మెడకు లేదు
రత్నాల హారముల్ రంజిల్లగా లేవు
పచ్చలు కెంపులు పొదగలేదు
వజ్రాల హారముల్ వర్ధిల్లగా లేవు
గోమేధికంబులు తోడలేవు
కలదు కలదొక్కమాల మీ కంఠమందు

ఎన్ని చేసిన అవియన్ని ఎంచియెంచి
మంచియైనను చెడుగైన త్రుంచకుండ
బ్రహ్మ మీకిచ్చి పంపును బరువుమాల
కర్మలన్నియు చేర్చిన కంఠమాల

మనము వెంటతెచ్చుకున్న ఈ కంఠమాల ఎవ్వరికీ చూడటానికి వీలుకాదు. ఈ కంఠమాలను ధరించి మనము జన్మిస్తున్నాము. ఆ మాలతోనే మన జీవితాన్ని గడుపుతున్నాము. ఏ ఫలితములను ఆశించినా కానీ ఈ కంఠమాలను తాకట్టు పెట్టటం దానినుండి అనుభవించటము. ఈ కంఠమాల మనకు ఎక్కడనుండి వచ్చింది? ఈ కర్మమాల మనకు ఎక్కడనుండి వచ్చింది? మన క్రియలచేతనే వచ్చింది, మన తలంపులచేతనే వచ్చింది. కనుకనే యువకులైన యీనాటి విద్యార్థులు తమ తలంపులను, క్రియలను పవిత్రమైనవిగా చేసుకోటానికి ప్రయత్నించాలి.

**ఆటలు ఆడే సమయంలో ఆటలపైనే లక్ష్యం వుండాలి, విజయముపైన కాదు**

sri sathyasai vachanamrutam

అనేకమంది విద్యార్థులు ఈ sportsలో పాల్గొనటానికి వెనుకంజ వేస్తూ వచ్చారు. కాని వారు నిజంగా మనోతత్త్వాన్ని అర్థము చేసుకోలేకపోవటంచేతనే sports లో వెనుకంజ వేస్తూ వచ్చారు. మన హృదయమునుండి ఆవేదనతో, ఆవేశముతో వచ్చి ఈ ఆటలాడాలి. ఇది ఒక కసరత్తువంటిది. తద్వారా మానసికమైన సంకల్పాలు కొంతవరకు అరికట్టుకోటానికి వీలవుతుంది. ఈ ఆటలు ఆడే సమయములో ఆటలపైన లక్ష్యం వుండాలి. విజయము, విజయము అని విజయముపైన మన లక్ష్యము పెట్టుకోకూడదు. విజయముపైన మన లక్ష్యము పెట్టుకుంటే ఆటలయొక్క లక్ష్యము తగ్గిపోతుంది. దాని నియమాలను వుల్లంఘిస్తాము. ఆటలలో ఒక్కొక్క ఆటకు ఒక్కొక్క నియమము వుంటుంది. ఆ నియమం తప్పితే ఆటలలో విజయము చేకూరినా అది నిజమైన విజయం కాదు. ఆ నియమాన్ని ఖచ్చితముగా మనము పాటిస్తే, అది అపజయమైనా జయమే. అందుకోసమే వేదాంతములో 'న శ్రేయో నియమం వినా,' అన్నారు. నియమమనేది ప్రతి వ్యక్తికి ప్రతి పనియందు వుండాలి. ఈనాడు ఆ నియమమును మనం పాటించటం లేదు. దీనినే rules అన్నారు. వీనిని అనుసరించటమే regulation అన్నారు. rules and regulations మనం సరైన దృష్టితో చూసుకోవాలి. దీనికి తగిన పద్ధతిని మనం కొంతవరకు సరైన మార్గంలో పెట్టుకుంటూ రావాలి. ప్రాక్టీసు వుండినప్పుడే ఈ పద్ధతి సక్రమముగా నడుస్తుంది.

పిల్లలు చాలా మంచివారు. చక్కగా ఆడతారు. చక్కగా పాడతారు. చక్కగా వుంటారు. అన్నింటికి కారణం మైండ్. అది పిచ్చికోతి. ఈ కోతికికూడా కొంచెం ట్రైనింగ్ యిస్తూ రావాలి. కోతిని ఆడించేవాడు ఏమిచేస్తాడు? దానికి పని పెట్టకపోతే వాని జేబు పెరుకుతుంది. వాని గోళ్లు పెరుకుతుంది. ఏమేమో చేస్తుంది. ఈ పని లేకుండా పోవటంవల్లనే అలా పిచ్చిపనులు చేస్తుంది. అందువల్లనే ఒక కట్ట పెడతాడు వాడు. 'ఎక్కరా తిమ్మన్నా, దిగరా తిమ్మన్నా,' అంటే అది ఎక్కుతూ దిగుతూ తనను తాను మర్చిపోతుంది. యువకులైన మీరు పిచ్చికోతిగా వుండే మనసును కట్టుకున్నారు. కనుక, మీరు కూడను దీనికొక పని పెట్టాలి. ఏ పని లేనప్పుడు 'సోహం', 'సోహం...' ఎక్కు, దిగు. ఈ శబ్దములో కూడను ఒక అర్థం వుంది. 'సో-అది, హం-నేను' అనగా 'అదే నేను' అనే భావముపెట్టుకుంటే తత్త్వమసి మార్గమును అనుభవించినవారమవుతాము. ఆనందించిన వారమవుతాము. కాని, ఈ ఆటలకు కూడను



sri sathyasai vahini amrutam

ఈ physicial instructors తగిన ఉత్సాహ, ప్రోత్సాహముల నందించాలి. పిల్లలకోసం వీళ్లను అధికారులుకూడా ప్రోత్సహించాలి. వీరుకూడా ఈ ఆటపాటలపైన అంత శ్రద్ధ చూపటం లేదు. ఒక చిన్న ఉదాహరణ: నిన్నటి దినం పిల్లలంతా వచ్చి చాలా ప్రార్థించారు, "స్వామీ! మాది ఫుట్‌బాల్, వాలీబాల్ మేచ్ ఏదో వుంది, స్వామి వచ్చి చూడాలి" అని. వారిని తృప్తి పరచాలని నేను వెళ్లాను. ఈ వాలీబాల్‌లోగాని, పుట్‌బాల్‌లోగానీ వారు బ్యాచస్ వేరుగా వుండాలి. ఏదైనా బాల్ కాలికి చిక్కిందంటే, చేతికి చిక్కిందంటే తన పార్టీవానికి అందించే మార్గము చూడాలి. బాల్ దగ్గర కందిరీగల మాదిరి అందరూ అక్కడే చేరిపోతారు. అది చాలా తప్పు. ఆ బాల్ దగ్గర ఆ పార్టీవాడొకడు ఈ పార్టీవాడొకడు యిద్దరే వుండాలి. మిగతా వారంతా దూరదూరంగా వుండాలి. ఈ దూరంగా వున్నవారు గోల్ దగ్గర వున్నవానికి బాల్ అందించాలి. ఇలా ఒకరికొకరు వారి గ్రూప్‌వారికి మాత్రమే బాల్ అందించేందుకు ప్రయత్నించాలి. అదియేమీలేదు. బాల్‌ను వీడుకొట్టటం, వాడు కొట్టటము. ఎక్కడికి పోతుంది యీ బాల్? ఏ విధముగా గోల్ అవుతుంది? వారికి ఈ లక్ష్యమే లేదు. కొట్టటమే, కొట్టటమే! ఇది games లక్ష్యమే కాదు. ఇది సరైన పద్ధతి కాదు. ఈ physical instructor వాటిని ఖండించాలి. బహుశా వారికికూడా ఈ విషయం తెలీదేమో అనుకుంటాను. పిల్లలను యెక్కడెక్కడ పెట్టాలి అని ప్రత్యేకముగా ఒక శిక్షణ యివ్వాలి. ఇప్పుడు సెంటర్‌లో బాల్ వుంటే నాలుగువైపులవారు అక్కడ చేరిపోతున్నారు. విస్తరాకులు వేస్తే కుక్కలన్ని వచ్చి చేరిపోతాయి చూడండి, ఆ విధముగా ప్రయత్నిస్తున్నారు. అది చాలా తప్పు. ఆటలకు సరైన పద్ధతే కాదు యిది. ఎవరూ గోల్ కొట్టలేరు, గంటలకొద్ది ఆడినప్పటికి. ఆటలు, ఆడేవారికి ఉత్సాహంగా వుండాలి. చూచేవారికి ఉత్సాహంగా వుండాలి. అప్పుడే తాము ఆనందించి పదిమందికి పంచినవారౌతారు. మొట్టమొదట తన ఆనందాన్ని తాను పెంచుకోవాలి. తాను పెంచుకున్న ఆనందమును పదిమందికి పంచాలి. ఇదే ఆటలయొక్క ఔన్నత్యము.

**దైవప్రేమను సాధించినవాడు ఏమైనా సాధించగలడు**

కనుక, యికముందు ఆడబోయే ఆటలలో పద్ధతిని చక్కగా గుర్తించాలి. ఆట ఆడటానికి పూర్వమే ఎవరెవరు ఎక్కడెక్కడ వుండాలి ఈ బాల్ ఏ విధముగా మనము గోల్‌కి సమీపముగా

srisathyasaivacharamrutam

తీసుకుపోవాలి అనేది చూడాలి. అక్కడ వ్యక్తిత్వమును మరిచిపోవాలి. Concentration లేకపోవటంచేతనే ఈ విధమైన అపజయములకు గురౌతున్నారు. bat చేతిలో వుంది కదా అని వచ్చినదంతా కొట్టకూడదు. కొన్ని వదలవలసినవి వుంటాయి. కొన్ని కొట్టవలసినవి వుంటాయి. చాలామంది క్రికెట్ ఆడారు. ఏమిటో అర్థమే కాదు మరి. వాడు కొడతాడు, వీడు కొడతాడు, వీడు పరుగెడతాడు, వాడు పరుగెడతాడు. ఇది సరైన పద్ధతే కాదు. కనుక పద్ధతిని మనము మొట్టమొదట సక్రమముగా అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకొని తాను ఆచరించినప్పుడు తన కానందము వస్తుంది. తనకు అపజయము కలిగినా జయము వచ్చినంత ఆనందమును అనుభవిస్తాడు. నిజముగా అర్థము చేసుకోకుండాపోతే వాడు జయించినప్పటికి అది వానికి తృప్తి నివ్వదు. ఎవరైనా సంగీతము పాడుతుంటారనుకోండి. పాట తెలియని వాళ్లు కొందరు వాళ్లందరు క్లాప్స్ చేయవచ్చు. కానీ అది అపస్వరములో కనుక పోతే పాడినవానికి ఎంతమంది క్లాప్స్ కొట్టినా తృప్తి వుండదు. కనుకనే self satisfication అత్యవసరము. ఆత్మతృప్తి వుండిన సమయములో అందరికి తృప్తే వస్తుంది. కనుక ఆత్మతృప్తి లేనివాడు ఎంతమంది తృప్తిపడినా ఆ తృప్తిపడినవారంతా మూర్ఖులనే చెప్పవచ్చు. కనుక మీరు తృప్తికరముగా ఆడండి. నీ పద్దతి నీవు చక్కగా ఆచరించు. ఆ ఆటకు సంబంధించిన నియమాలు నీవు ఉల్లఘించకుండా చూసుకో. ఏదో ఒక గోల్‌వేస్తే చాలని చెప్పి గీత దాటినా కొట్టకూడదు. కనుక ఆట పద్ధతిలో మన పిల్లలకు ప్రత్యేకమైన శిక్షణ యివ్వాలి. అందులో విద్యార్థులకు ఈ ఆటలు చాలా అవసరం. తిన్నది జీర్ణం కావాలి. జీర్ణించుకున్నది మంచి బలములో చేరాలి, రక్తములో చేరాలి. వూరికే మనం భుజించినంత మాత్రమున ప్రయోజనము లేదు. దానిని జీర్ణించుకోటానికి తగిన ఆటలు వుండాలి. ఈ బాల్యములో మంచి శరీరము ఒక ఉక్కుగుండుమాదిరి తయారవాలి. బలమైన దేహములో బలమైన మనస్సు చేరి వుంటుంది. ఆ రెండు బలంగా వుండిన యింక మనం సాధించలేనిది లోకములో ఒక్కటి వుండదు. అప్పుడే దైవానుగ్రహమునుకూడను సాధించవచ్చు.

కనుక, మానవుడీ జగత్తులో సాధించవలసిన సమస్త కార్యములలోను అతి ప్రధానమైనది దైవప్రేమ. దానిని సాధించాలి. ఆ ప్రేమను సాధించినవాడు ఏమైనా సాధించగలడు.

**(తేదీ. 14-01-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam